క్లుప్తంగా

ఇన్నేశుపేటను సందర్శించిన అధికారులు


బావిలో క్లోరినేషన్ చేయిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన ఇన్నేశుపేట గ్రామాన్ని బుధవారం తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఈఓపీఆర్డీ సత్యన్నారాయణ, మండల వ్యవసాయాధికారి టి.భార్గవిలు సందర్శించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్తగా బావుల్లో క్లోరినేషన్, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయించారు. వర్షాలకు కూలిపోయిన ఇళ్లు, వివరాలతో పాటు పంట నష్టాన్ని అంచనా వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కార్మికుల ఔదార్యం


గురుమూర్తి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న కార్మిక సంఘం సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న తోటి కార్మికులు మరో కార్మికుడి వైద్యానికి ఆర్థిక సాయాన్ని అందించి పెద్ద మనసు చాటుకున్నారు. ఈదుపురం గ్రామానికి చెందిన దల్లి గురుమూర్తి పోలెండ్‌లో వలస కూలీగా పనిచేస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. ప్రస్తుతానికి డయాలసిస్ చేయించుకుంటూ విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 'పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం తరఫున కార్మికులు స్పందించి 1,51,000 రూపాయలను గురుమూర్తి తల్లిదండ్రులకు బుధవారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న గ్రామ పెద్దలు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిభ గల విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి ప్రోత్సాహించారు ప్రవాసాంధ్రుడు తిప్పన శంకరరావురెడ్డి. తన స్వగ్రామమైన తిప్పనపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఏటా వినాయక చవితి సందర్భంగా గ్రామస్తుల సమక్షంలో ప్రోత్సాహకాలు అందించడం గత కొన్నేళ్లుగా చేస్తున్నారు. బుధవారం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో రూ.1500 చొప్పున నగదును పలువురు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిప్పన పురుషోత్తమరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సహారా డిపాజిట్లు చెల్లించాలి


డిపాజిట్లు చెల్లించాలని కోరుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

సోంపేట: సహారా బాధితులకు తక్షణం డిపాజిట్లు చెల్లింపులు జరిగేటట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సహారా కస్టమర్స్, ఫీల్డ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోంపేటలో అసోసియేషన్ సమావేశం బుధవారం జరిగింది. సుప్రీం కోర్టు 2012లో ఖాతాదారులకు 15 శాతం వడ్డీతో తిరిగి చెల్లింపులు చేయమని ఆదేశాలు అందజేసినా సహారా ఇండియా కంపెనీ పట్టించుకోలేదన్నారు. శ్రీకాకుళం రీజన్ పరిధిలో సుమారు రూ. 500 కోట్లు సహారా సంస్థ ద్వారా ఇవ్వాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ బి.సత్యరాజ్, అసోషియేషన్ ప్రతినిధులు సుందరరావు, సీహెచ్ మాధవరావు, సూర్యారావు, రామచరణ్ విశ్వేశ్వరరావు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో హైమావతి

కోటబొమ్మాళి: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తోందని కోటబొమ్మాళి ఐసీడీఎస్ పీవో చింతాడ హైమావతి అన్నారు. సరియాబొడ్డపాడు పంచాయతీ బడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బడ్డిపేట, సరియాబొడ్డపాడు, శ్రీజగన్నాథపురం, పాడుగుపాడు, రామచంద్రాపురం, ఎత్తురాళ్లపాడు, పంతులుపేట అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఉమ్మడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తయారుచేసి వాటిని పదర్శించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలిసిన ఆహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు డి.సత్యప్రియ, డి.పద్మలత, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.ప్రభావతి, కె.లక్ష్మి, డి.విజయలక్ష్మి, ఎస్.సునీతాదేవి, పి.నీలవేణి, ఎస్.చంద్రకళ, వై.ఎర్రమ్మ, పి.నాగమణి పాల్గొన్నారు.

• రోడ్లు వర్షార్పణం!

ఇటీవల కురిసిన వర్షాలకు పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. పెద్దపెద్ద గోతులు కావడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గోతుల్లో మోకాలలోతు నీరు చేరడంతో పరిస్థితిదారుణంగా ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు


కాశీబుగ్గ: అధ్వానంగా తయారైన చినబడం గ్రామానికి వెళ్లే రోడ్డు


కాశీబుగ్గ: శిథిలమైన నిర్మాణంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ వంతెన పక్క అప్రోచ్‌రోడ్


వజ్రపుకొత్తూరు: హుకుంపేట వద్ద చెరువును తలపిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి


వజ్రపుకొత్తూరు: పూండి వైఎస్సార్ కూడలి వద్ద రోడ్డు దుస్థితి

• మోదం.. ఖేదం!


శాసనాంలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు


ముంపునకు గురైన రత్తకన్న పంట పొలాలు

ఇచ్ఛాపురం రూరల్: ఒకవైపు సాగునీరు అందక వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఇటీవల కురిసిన వర్షం ఆనందాన్ని ఇస్తే...అదే వర్షం తమ పంట భూములను ముంచేసిందని మరికొంత మంది రైతులు లబోదిబోమంటున్నారు. ఇచ్ఛాపురం మండలంలో అన్నదాతలకు భారీ వర్షాలతో ఎదురైన విచిత్ర పరిస్థితి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది వేల ఎకరాలకు గానూ 6,500 ఎకరాల్లో వరినాట్లు వేయగా 4,200 ఎకరాలకు వ్యవసాయాధికారులు ఈ-క్రాప్ చేశారు. మిగిలిన 2,500 ఎకరాల్లోకి సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రెండు రోజుల పాటు కురిసిన వర్షం వారి పాలిట వరంగా మారింది. దీంతో మంగళవారం రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో బిజీబిజీగా గడిపారు.

• గణపతికి ప్రత్యేక పూజలు

గణపతి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీపారాధన పూజలు జరిగాయి. కొన్నిచోట్ల భక్తులకు అన్న ప్రసాదాన్ని ఉత్సవ కమిటీలు వితరణ చేశాయి.


సోంపేట: పలాసపురం శ్రీశయన వీధిలో దీపారాధన


కంచిలిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి సూదికొండలో అన్నదానం


కాశీబుగ్గ: శ్రీనివాసనగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తదితరులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వాహణ పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 13వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ జి.శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రావివలస, శ్యామసుందరాపురం జగనన్న కాలనీ, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గోతులు పూడ్చివేత

టెక్కలి: స్థానిక గోపినాథపురం సమీపంలో రైల్వే గేటుకు ఆనుకుని రోడ్డుకు ఏర్పడిన గోతులను షిర్డీసాయి ఐటీఐ నిర్వాహకులు మంగళవారం పూడ్చి వేశారు. ఇటీవల భారీగా గోతులు ఏర్పడి వాహనచోదకులు అనేక అవస్థలు పడుతుండేవారు. దీంతో ఐటీఐ నిర్వాహకుడు మన్మధరావు ఆధ్వర్యంలో గోతులను పూడ్చి వేశారు. ఐటీఐ నిర్వాహకులు చేసిన సామాజిక కార్యక్రమానికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రెంటికోటలో పోషకాహార మాసోత్సవం


మాట్లాడుతున్న సీడీపీవో లావణ్య

పలాస: మండలంలోని రెంటికోట, అల్లుకోల గ్రామాల్లో బుధవారం ఘనంగా పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా కిశోర్ బాలబాలికలు తీసుకోవలసిన పౌష్టికాహారం గురించి కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో వై.లావణ్య వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత ప్రతిజ్ఞను పాటించాన్నారు. సర్పంచులు దువ్వాడ వామాక్షి, శాసనపురి తిరుమలరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహనరావు, జి.శాంతమ్మ, పీహెచ్‌సీ వైద్యులు సునీల్ కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కాలువలు ఆక్రమిస్తే చర్యలు
టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలో మురుగు కాలువలు ఆక్రమించి వాటిపై ఇళ్ల నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు నిర్వహిస్తే అటువంటి వారిపై శాఖాపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ హెచ్చరించారు. బుధవారం టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వైఎస్సార్ జంక్షన్ నుంచి సంతోషిమాత ఆలయం వరకు పూర్తిగా మూసుకుపోయిన మురుగు నీటి కాలువను పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేశారు. డీఎల్‌పీఓతో పాటు పంచాయతీ కార్యదర్శి కె.వి.జగన్నాథం కాలువ పనులను పరిశీలించారు.

రిటైర్డ్ హెచ్‌ఎం ఔదార్యం
కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి హైస్కూల్‌కు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నగిరి లక్ష్మీనారాయణ రూ. పది వేలు బుధవారం అందించి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఈ మొత్తాన్ని పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించినప్పుడు శుభ్రత పాటించేందుకు వీలుగా కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్కులు, అప్రాన్‌లు కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. హెచ్‌ఎం సుందర్ సాల్మాన్, ఎస్.అప్పారావు, నగిరి కరుణాకర్, ఎస్.నారాయణరావు ఉన్నారు.

సౌత్‌జోన్-1 క్రీడా పోటీలకు జ్ఞానభారతి విద్యార్థులు
ఇచ్ఛాపురం: ఈనెల 14 నుంచి 17వ తేదీవరకు తెలంగాణలోని నల్గొండ ఏకశిలా అడ్వాన్స్ లెర్నింగ్ స్కూల్ ఆవరణలో జరుగనున్న సీబీఎస్‌ఈ సౌత్‌జోన్-1 క్రీడా పోటీలకు స్థానిక సీబీఎస్‌ఈ పాఠశాల జ్ఞానభారతికి చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్ బుధవారం తెలిపారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం
సంతబొమ్మాళి: విజయవాడ వరద బాధితులకు నౌపడ సత్యసాయి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. రూ. 10 వేలు విరాళాలు సేకరించామని.. ఈ మొత్తం యూనియన్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

కాలువ నిర్మాణానికి చర్యలు
పలాస: గంగువాడ గ్రామంలో మురుగు కాలువ నిర్మాణానికి మండల అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. కాలువ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు స్థల పరిశీలన చేశారు. అయితే తమ ఇళ్ల ముందు నుంచి కాలువ నిర్మాణం చేయకూడదని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి ఫాల్గుణరావు, సచివాలయం ఇంజినీరు శృతి, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
ఇచ్ఛాపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జేసీఐ అధ్యక్షుడు షణ్ముఖరావు అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణ, పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నీటిపరిరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు, మొక్కలను నాటే కార్యక్రమాలను చేపట్టారు.

మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
ఇచ్ఛాపురం: దేశరక్షణలో విధులు నిర్వహించిన మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.ఎల్.నారాయణరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఇచ్ఛాపురం వచ్చిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విశ్వనాథం, శంకరరావు, హరి, బైరాగి, బ్రహ్మం, ఈశ్వరి, దుర్గారావు, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి ఉన్నారు.

జానపద కళాకారునికి సన్మానం
పలాస: ఉద్దానం జానపద కళాకారుడు, ఉత్తమ అధ్యాపకుడు బత్తిన శాంతారావు దంపతులను బాహాడపల్లి గ్రామానికి చెందిన ఆసిరమ్మ యూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బుధవారం ఘనంగా సన్మానం చేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించండి
కంచిలి: హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డ్వాక్రా సంఘాలను ఐఈసీ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు కోరారు.
ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు హెచ్‌ఐవీ, టోల్‌ఫ్రీ నంబర్ 1097పైన అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వైసీబీ-పీయూ - ట్రక్కర్స్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా'కార్యక్రమం ద్వారా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. స్థానిక ఏపీఎం పి.ఉమారాణి, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మండలస్థాయి స్కూల్స్ గేమ్స్ ప్రారంభం
వజ్రపుకొత్తూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-16, అండర్-17 విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. పూండి గోవిందపురంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో బాలబాలికను ఎంపిక చేశారు. కార్యక్రమంలో గోవిందపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హరిబాబు, గణేష్ ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం..
కాశీబుగ్గ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్‌ఎంసీ చైర్మన్ కొంచాడ సురేష్‌కుమార్ అన్నారు. హరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా మందస మండల స్కూల్ గేమ్స్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల ఎంపిక పోటీలు జరిగాయి. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మార్పు చక్రధర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం సాంబమూర్తి, ఉపాధ్యాయులు కోదండరావు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన
కవిటి: మండలంలోని బీలప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగిన వరిపొలాలను కవిటి మండల వ్యవసాయ అధికారి బి.దుర్గాప్రసాద్ బుధవారం పరిశీలించారు. వరినాట్లు వేసి సుమారు 40 రోజులు అవుతోందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. పుక్కళ్లపాలెం వద్ద రంగాలగెడ్డ వరదనీరు సముద్రంలో జోరుగా కలుస్తోందని వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. ఇద్దివానిపాలెం వద్ద గొనామరి గెడ్డ వరదనీటి మళ్లింపు ప్రక్రియ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

నాట్య కళాకారులకు అరుదైన అవకాశం
ఇచ్ఛాపురం: శ్రీశైలం మల్లికార్జున దేవస్థానం సన్నిధిలో ఈనెల 13వ తేదీన నిర్వహించే ధర్మపథం సాంస్కృతిక నాట్య పోటీల కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశం ఇచ్ఛాపురంలోని వేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు దక్కింది. ఈ విషయాన్ని అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి బుధవారం తెలిపారు. నాట్యగురువు శృతిపట్నాయక్ ఆధ్వర్యంలో నాట్యకారులు డి.కావ్య, శైలు, పూజశ్రీ, జయలక్ష్మి, శ్వేతా, ప్రీతీ, కె.లక్ష్మీసింధు, పల్లవి, లిఖిత, శ్రీదీక్షిత, ప్రణవి, స్నేహశ్రీ, సోనాక్షి, మధుశ్రీ, జైత్రికాత్యాయని అకాడమి అవరణలో బుధవారం అభినందించారు.

ప్రజలను అప్రమత్తం చేయడంలో
కూటమి ప్రభుత్వం విఫలం

• ఫొటోలకే చంద్రబాబు పరిమితం
• మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. 'సాక్షి'తో బుధవారం ఆయన మాట్లాడారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో విజయవాడ ప్రజలను అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వరదలను నివారించడంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రికి అవగాహన లేదన్నారు. హోం మంత్రి మైక్ పట్టుకుంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడానికే పదవి ఇచ్చినట్లు ఉందని విమర్శించారు. బుడమేరు కారణంగా ముంపునకు గురైన విజయవాడలోనే వరదలు తగ్గుముఖం పట్టేవరకు ఉంటానని చెప్పి చంద్రబాబు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. చంద్రబాబు కరకట్టల మీద కట్టిన ఇల్లు మునిగిపోతుందనే భయంతోనే ఆయన్ని అధికారులు కలెక్టరేట్‌లో ఉంచారనే విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. నదీ గర్భంలో చంద్రబాబు ఇల్లు కట్టడం వలనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. అయితే చేతకాన్నితనాన్ని, బేలతనాన్ని కవర్ చేసుకోవాడానికే చంద్రబాబు విజయవాడ వీధుల్లో తిరుగుతున్నారని విమర్శించారు. రోజంతా అధికారులను వెనకేసుకొని తిరుగుతుంటే వరద బాధితులకు సహాయక చర్యలు ఎవరు చేస్తారని ప్రశ్నించారు. తుఫాన్‌లు, వరదల నుంచి ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. తిత్లీ తుఫాన్‌లో సైతం పలాసలో చంద్రబాబు డ్రామాలు వేసి ప్రకృతిపై విజయం సాధించినట్లు ఫొటోలకు ఫోజులు ఇచ్చి బ్యానర్‌లు కట్టుకున్నారని గుర్తు చేశారు. వాతావరణశాఖ హెచ్చరికలు ఉన్నప్పటికీ అన్ని శాఖలను అప్రమత్తం చేయకపోవడమే విజయవాడ ముంపునకు కారణమైందన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో సైతం కూటమీ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండిఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో బాధితులను అన్నివిధాలా ఆదుకునేవారని అప్పలరాజు అన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీఎం వాహనాలు విజయవాడ వరద బాధితులకు కోసం ఎంతోఉపయోగపడ్డాయన్నారు. అవే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనితనానికి నిదర్శణమని విజయవాడ ప్రజలు అనుకుంటున్నారన్నారు. వరదల్లో ప్రజలు ఉంటే కమిటీల పేరుతో చంద్రబాబు కాలయాపన చేస్తున్నారన్నారు. కేవలం చంద్రబాబు, ఏబీఎన్ రాధాకృష్ణకు చెందిన పవర్‌ప్లాంట్ ముంపునకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే బుడమేరు గేట్లను అర్ధరాత్రి వేళ ఎత్తివేయించి వరదను విజయవాడ నగరంలోకి మళ్లించారని ఆరోపించారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు

కంచిలి: మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయంలో రాధాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా రాధాకృష్ణులకు ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని పెట్టారు. రాధాకృష్ణుల ఊంజల్ సేవకు ఉపయోగించిన చీరను బహిరంగ వేలం నిర్వహించగా దీన్ని స్థానిక వైద్యుడు నర్తు కృష్ణంరాజు 5,116 రూపాయలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, యాదవ సంఘ ప్రతినిధులు నర్తు నరేంద్రయాదవ్, సాలిన లక్ష్మణమూర్తి, కొర్రాయి వాసుదేవరావు, దట్టి అజయ్ కుమార్, బంగారు కురయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్తకోట శేఖర్, డొక్కరి బలరాం, స్థానిక కళింగ కోమటి సంఘం అధ్యక్షుడు ఇప్పిలి ప్రవీణ్ కుమార్, వూనా శ్రీకాంత్, మామిడి విశ్వనాథం, శ్రీను మాస్టార్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును వెనక్కి తీసుకోవాలి


ర్యాలీ చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టెక్కలిలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కమిటీ నాయకులు, విద్యార్థులంతా పెద్ద ఎత్తున పాత జాతీయ రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోకర నారాయణరావు, చల్లా రామారావు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమన్నారు. ఇదే వర్గీకరణ అంశంపై గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను సుప్రీంకోర్టు తప్పుపట్టిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులుబి.చిన్నవాడు, డి.ఎ.స్టాలిన్, కె.కామేశ్వరరావు, జె.బాబూరావు, కె.దాలయ్య, ఎస్.గోపీనాథ్, ఎ.రాహుల్, జె.జయరాం, సీహెచ్.శ్రీనివాస్, టి.సూర్యం, పి.డిల్లేశ్వర్రావు, గడ్డెయ్య, పి.లింగమూర్తి, లక్ష్మీనారాయణ, బి.గోపాలరావు, దమయంతి, కసవయ్య, డి.సూర్యనారాయణ, బి.వినోద్, ఎ.లోకనాథం ఉన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

• ఆర్డీవో భరత్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్‌నాయక్

పలాస: వర్షాకాలంలో మండల స్థాయి అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలని పలాస ఆర్డీవో డాక్టరు భరత్‌నాయక్ చెప్పారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డివిజన్‌లో ఎనిమిది మండలాలకు చెందిన తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు, సివిల్ సప్లయ్ డీటీలు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్లు, అకాల వర్షాలు వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని, పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించి వారికి తెలియజేయాలని చెప్పారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో ఉన్న ప్రజలకు ఎప్పటికప్పుడు తగిన సలహాలు సూచనలు ఇవాలని చెప్పారు. అలాగే పలాస డివిజన్‌కు ఎయిర్ పోర్టు మంజూరైందని, అందుకు సుమారు వెయ్యి ఎకరాలు భూమి కావాలని, వాటిని కూడా ఆయా మండలాల అధికారులు దానిపై దృష్టి పెట్టాలని, స్థల సేకరణ చేయవలసిన అవసరం ఉందన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం


నరేంద్రనాథ్ పట్నాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల స్వీకరించిన కొలిగాం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్‌ను మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో కురమాన అప్పారావు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.


నందిగాం: తులసీప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నందిగాం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న లఖిదాసుపురం ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు తులసీప్రసాద్‌ను సిబ్బంది బుధవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు చిలుకు క్రిష్ణారావు, ఉపాధ్యాయులు ఆర్.రామారావు, బి.రత్నం, గోవిందరాజు, ప్రియదర్శిని, వై.త్రినాథరావు, డి.శ్రీనివాస్, డి.ధ్యారాణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతు సంఘాలంతా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటిలో బీవీకే రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బలరామ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురాణాల ప్రకారం రైతు దినోత్సవంగా జరిపే ఈ పండుగనాడు బలరాముని చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యవసాయఅధికారులు, శాస్త్రవేత్తలు ఉద్యాన, వ్యవసాయ శాఖలకు సంబంధించి వివిధ పంటల యాజమాన్యంలో తీసుకోవాల్సిన పద్ధతుల్ని అధికారులు వివరించారు. అఖిలభారత కిసాన్ సంఘ్ ప్రతినిధి జలగం కుమారస్వామి, సోంపేట అగ్రికల్చర్ ఏడీ కె.జగన్మోహనరావు, కవిటి ఉద్యానశాఖ అధికారిణి పి.మాధవీలత, కవిటి, సోంపేట ఏవోలు బడగల దుర్గాప్రసాద్, బొర్ర నరసింహమూర్తి పాల్గొన్నారు.